దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ: ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్న సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ సంస్థ డైరెక్టర్ డా. విమలారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సుల్లో చేరడానికి ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, డిప్లొమా అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు సెప్టెంబర్ 19వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. పూర్తి వివరాలకు ఫోన్ నం.78931 41797.

నియామకం

కాచిగూడ: హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ కోశాధికారిగా ఎ.సూర్యప్రకాష్ సింగ్ నియామితులయ్యారు. ఈ సందర్భంగా బుధవారం బర్కత్‌పురలోని పార్టీ నగర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... పార్టీని నగరంలో మరింత పటిష్టవంతం చేసి వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గ్రేటర్ పీఠాన్ని కైవసం చేసుకుంటామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నగర ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

బర్కత్‌పురాలో డీజీపీ పూజలు

కాచిగూడ: బర్కత్‌పుర హౌసింగ్ బోర్డు కాలనీ పార్కులో ఏర్పాటు చేసిన గణపతిని బుధవారం రాత్రి రాష్ట్ర డీజీపీ జితేందర్ కుమార్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయనను జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు సత్కరించారు. ఈ కార్యక్రమంలో టి.శేషునారాయణ, రాజశేఖర్‌రెడ్డి, ఉషా, అనిల్, ప్రసాద్, సతీష్, తదతరులు పాల్గొన్నారు.

ఓయూలో ముగిసిన క్రీడాపోటీలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ మోడల్ స్కూల్‌లో మూడు రోజులు జరిగిన అంతర్ పాఠశాలల బాల, బాలికల క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. ముషీరాబాద్ మండలం 69వ ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన కబడ్డీ, ఖోఖో ఆటల పోటీల్లో 15 పాఠశాలు పాల్గొన్నట్లు తెలిపారు. ముగింపు కార్యక్రమానికి ముషీరాబాద్ కార్పొరేటర్ సుమిత్ర నవీన్ రావు, డిప్యూటీ డీఈఓ శ్రవణ్, మోడల్ స్కూల్ హెచ్ఎం జ్యోతిశ్రీ విజేతలకు బహుమతులను అందజేశారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ: వర్సిటీలు, ఇంజినీరింగ్ కాలేజీల్లో మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం ఓయూలో ఆయన మాట్లాడుతూ.. దేశ భవిష్యత్‌ను తీర్చిదిద్దే విద్యార్థులు మత్తుకు బానిసలవ్వడం దురదృష్టకరమన్నారు. విద్యార్థుల భవిష్యత్‌పై ఇది తీవ్రప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్ నియంత్రణకు ఏర్పాటు చేసిన ఈగల్ ఫోర్సును పెంచి మత్తుపదార్థాల విక్రయాలను పూర్తిగా నియంత్రించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు.

నిజాం కాలేజీలో పార్టుటైం అధ్యాపక ఉద్యోగాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని నిజాం కాలేజీలో డిగ్రీ, పీజీ కోర్సులకు బోధించుటకు పార్టుటైం అధ్యాపక ఉద్యోగాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఇంగ్లిష్, సంస్కృతం, కంప్యూటర్ సైన్స్, కామర్స్, ఎకనామిక్స్, జనటిక్స్, బయోటెక్నాలజీ, ఎంబీఏ, పొలిటికల్ సైన్స్, గణితశాస్త్ర, స్టాటిస్టిక్స్‌లతో పాటు కెమిస్ట్రీ (ఆర్గనిక్, ఫిజికల్, ఫార్మకో–ఇన్ఫర్మేటిక్స్) సబ్జెక్టుల బోధనకు ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. అర్హత గల నిరుద్యోగులు ఈ నెల 11 వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ ప్రొ.ఏవీ రాజశేఖర్ తెలిపారు.

ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలపై స్పందించండి

ఉస్మానియా యూనివర్సిటీ: బీఆర్ఎస్ నాయకులపై ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలపై స్పందించాలని ఓయూ విద్యార్థి నేత, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు వలిగొండ నరసింహ అన్నారు. బుధవారం ఆయన ఓయూలో మాట్లాడుతూ సిరిసిల్ల నియోజకవర్గం నేరేళ్ల గ్రామానికి చెందిన ఏడుగురు దళితులపై సంతోష్‌రావు సీఎంఓ కార్యాలయం నుంచి ఫోన్ చేసి దాడి చేయించారని కవిత చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్‌లోని దళిత నాయకులు స్పందించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పాలనలో దళితులపై జరిగిన దాడులు, హత్యలు, అత్యాచారాలపై బీఆర్ఎస్‌లోని దళిత నేతలు మాజీ ఉపముఖ్యమంత్రి రాజయ్య, మాజీ ఎమ్మెల్యే, ఎంపీ బాల్క సుమన్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు గాదిరి కిశోర్, రసమయి బాలకిషన్, ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, మన్నె క్రిషాంక్ తదితరులు స్పందించాలని డిమాండ్ చేశారు.

సమస్యల ఊబిలో బస్తీలు!

కాచిగూడ: కాచిగూడలోని బస్తీలు సమస్యల సుడిలో కొట్టుమిట్టాడుతున్నాయి. బస్తీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంలో దశాబ్దాకాలంగా నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. ఎక్కడ చూసినా డ్రైనేజీల నుంచి పొంగుతున్న మురుగునీరు, నాలాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, వెలగని వీధి దీపాలు, వీధి కుక్కల బెడద, మంచినీటి కొరత తదితర సమస్యలు స్థానికులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. సమస్యలు పరిష్కరించాలని స్థానికులు ఎన్నిమార్లు మొరపెట్టుకుంటున్నా అధికారులు వినిపించుకున్న పాపానపోలేదు.

- కాచిగూడలోని విక్రమ్‌నగర్, ఇందిరానగర్, మౌలానా ఆజాద్ నగర్, నింబోలిఅడ్డ, కుద్బిగూడ, తదితర ప్రాంతాల్లో గుంతలు పడ్డ రోడ్లు, సమస్యలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్లపై నిలుస్తున్న వర్షపు నీరు, డ్రైనేజీ మురుగుతో దుర్వాసన వెదజల్లుతోంది. ఫలితంగా స్థానికులు జ్వరాల బారిన పడుతున్నారు. సమస్యను పరిష్కరించాలని గతంలో అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- విక్రమ్‌నగర్‌లో కూలిన పబ్లిక్ టాయిలెట్స్
- విక్రమ్‌నగర్‌లో పబ్లిక్ టాయిలెట్స్ కూలి పోయి నెలలు గడుస్తున్నా మట్టిని తొలగించడం లేదు. రోడ్డుపై మట్టికుప్పలు పేరుకుపోయి బస్తీలోకి రాకపోకలు ఇబ్బంది కరంగా మారింది. కూలి పోయిన గోడ మట్టికుప్పలను తొలగించాలని అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు తెలిపారు.



విక్రమ్‌నగర్ లో కూలిన పబ్లిక్ టాయిలెట్లు

ఫెన్సింగ్ లేని ట్రాన్స్‌ఫార్మర్

విక్రమ్‌నగర్ పార్కు వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫెన్సింగ్ లేకపోవడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందో ననే భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు స్థానికులు, ట్రాన్స్‌ఫార్మర్ వద్దే చెత్తను వేస్తుండటంతో చెత్తను తొలగించడంలో జీహెచ్ఎంసీ స్వీపర్స్ పడరాని పాట్లు పడుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫెన్సింగ్ ఏర్పాటు చేసి చెత్త వేయకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఫెన్సింగ్ లేని ట్రాన్స్‌ఫార్మర్

గ్రేడ్‌-2 ఈఓగా సురేందర్‌కుమార్

కాచిగూడ: దేవదాయ శాఖలో గ్రేడ్–3 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న జి.సురేందర్ కుమార్‌కు గ్రేడ్–2 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పదోన్నతి లభించింది. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా సురేందర్ కుమార్ పదోన్నతి పత్రాన్ని అందుకున్నారు. ప్రస్తుతం సురేందర్ కుమార్ కాచిగూడలోని పూనంచంద్‌గాంధీ జైన్ ధర్మశాల, బేగంబజార్‌లోని రామ్‌నాథ్ ఆశ్రమం, గుట్టల వీరన్న ట్రస్ట్, పరశురామ్ మందిర్, సిఖ్‌విలేజ్‌లోని శ్రీదేవి మహంకాళి మందిర్, జనరల్‌బజార్ లోని రాందిన్ మందిర్‌కు ఆయన ఎగ్జిక్యూటివ్ అధికారిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా కాచిగూడ లోని జైన్ ధర్మశాలలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రజలకు, భక్తులకు మరిన్ని మెరుగైన వసతులను కల్పించే విధంగా తన వంతు కృషి చేస్తానని తెలిపారు.



సురేందర్‌కుమార్‌కు పదోన్నతి పత్రాన్ని అందజేస్తున్న మంత్రి కొండా సురేఖ

10న ‘అగర్వాల్ నారీ శక్తి పర్వం’

హిమాయత్‌నగర్: మహారాజా శ్రీ అగ్రసేన్ మహారాజ్ జయంతి ఉత్సవాలలో భాగంగా శ్రీ అగ్రసేన్ నారీ శక్తి పర్వం మహిళా ఉత్సవాన్ని ఈ నెల 10న సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు అగర్వాల్ సమాజ్ తెలంగాణ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా తెలిపారు. బుధవారం ఆహ్వాన కమిటీ చైర్మన్‌గా నరేంద్ర కుమార్ గోయల్, జయంతి వేడుకల కన్వీనర్‌గా సీమా జైన్, కల్చరల్ కమిటీకి చైర్మన్‌గా ఋతు అగర్వాల్, వైస్ చైర్మన్లుగా డింపుల్ అగర్వాల్, రజని అగర్వాల్, ఆర్తి అగర్వాల్, అనూ కేడియాలకు నియామక పత్రాలు అందజేశారు.

భవిష్యత్‌పై విద్యార్థుల చూపు

ఉస్మానియా యూనివర్సిటీ: బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ అయిన ఎమ్మెల్సీ కవిత భవిష్యత్ కార్యచరణపై ఓయూ విద్యార్థి నేతలు వేచిచూస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న అనేక మంది విద్యార్థి నాయకులు రాజకీయ, అధికార పదవుల అవకాశాల కోసం ఎదురుచూస్తున్న విషయం విధితమే. రాష్ట్ర అవతరణ అనంతరం ఏర్పడిన బీఆర్ఎస్ ప్రభుత్వంలో సుమారు 13 మందికి అవకాశాలు లభించగా, కాంగ్రెస్ పాలనలో కేవలం ముగ్గురికి మాత్రమే అధికార పదవులు దక్కాయి. దీంతో 12 ఏళ్లుగా సుమారు 30 మంది విద్యార్థి నాయకులు అవకాశాల కోసం వివిధ పార్టీల్లో తృతీయ శేణి నాయకులుగా సీనియర్ నేతలకు అనుచరులుగా తిరుగుతున్నారు. కవిత కొత్త పార్టీ పెడితే ఓయూ నుంచి విద్యార్థి నేతలు చేరే అవకాశాలు ఉన్నాయన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నాయకులు పేర్కొన్నారు.

వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో శంకరనారాయణకు చోటు



శంకరనారాయణకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న నరేందర్‌గౌడ్, కళా జనార్దనామూర్తి

చిక్కడపల్లి: ప్రముఖ హాస్యావధాని శంకరనారాయణ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్‌లో స్థానం సంపాదించారు. బుధవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో జరిగిన కార్యక్రమంలో వండర్ బుక్ రికార్డ్స్ ముఖ్య సమన్వయకర్త బి.నరేందర్‌గౌడ్ గానసభ అధ్యక్షుడు కళా జనార్దనామూర్తితో కలసి శంకరనారాయణకు రికార్డు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ విదేశాలలో వేలాది హాస్య కార్యక్రమాలను నిర్వహించానని అన్నారు. 27 సంవత్సరాలుగా 550 హాస్యావధానాలు చేశానని పేర్కొన్నారు. త్యాగరాయ గానసభలో 25 గంటల పాటు ప్రజా హాస్యావధానం జరిగిందన్నారు. వీటిని గుర్తించి వండర్ రికార్డ్స్ ఇంటర్నేషనల్‌లో రికార్డు నమోదు చేశాని తెలిపారు. ఈ సందర్భంగా కళా జనార్దనామూర్తి మాట్లాడుతూ... హాస్యావధానాలు, హాస్య కార్యక్రమాలు నిర్వహించి మరిన్ని అవార్డులు, రికార్డులు నెలకొల్పాలని ఆకాంక్షించారు.



కాచిగూడ నుంచి లింగంపల్లి వరకు జరిగిన ఫ్లాగ్‌మార్చ్‌లో ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి, పోలీసులు

శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యం

ఈస్ట్‌జోన్ డీసీపీ డా. బాలస్వామి

కాచిగూడ: గణపతి నిమజ్జనాన్ని పురస్కరించుకొని శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీస్ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి తెలిపారు. బుధవారం 300 మంది సాయుధ పోలీస్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ చేపట్టారు. అఫ్జల్‌గంజ్ నుంచి మొజంజాహీ మార్కెట్ మీదుగా ప్రధాన రోడ్ల నుంచి కాచిగూడ లింగంపల్లి వరకు ఫ్లాగ్‌మార్చ్ కొనసాగింది. ప్రజల్లో ధైర్యం నింపడానికే పోలీస్ ఫ్లాగ్ మార్చ్ అని తెలిపారు. ప్రజల భద్రతే ముఖ్యమని వారు పేర్కొన్నారు. ప్రజలకు పోలీసులు అందుబాటులో ఉంటారనే భరోసా కలిపించడానికే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని అన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. వినాయక నవరాత్రి ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబీ పండుగలను ప్రజలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు. నగర సీపీ సీవీ ఆనంద్ ఆదేశాల మేరకు ఈ ఫ్లాగ్‌మార్చ్ చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ జె.నర్సయ్య, ఏసీపీ ఎం.మట్టయ్య, ఏసీపీ హరీష్ కుమార్, కాచిగూడ ఇన్‌స్పెక్టర్ టి.జ్యోత్స్న, డీఐ రఘుకుమార్, అడ్మిన్ ఎస్సై హెచ్.నరేష్, ఎస్సైలు కృష్ణవేణి, భరత్‌కుమార్, శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కవిత నిర్ణయాలకు కట్టుబడి ఉంటాం

అంబర్‌పేట: జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీసుకునే నిర్ణయాలకు తాము కట్టుబడి ఉంటామని జాగృతి యూత్‌వింగ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌ముదిరాజ్ తెలిపారు. బుధవారం అంబర్‌పేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ నేతలు అభిలాష్‌గౌడ్, కె. సత్యనారాయణలతో కలిసి ఆయన మాట్లాడారు. తమ అధినేత్రి ఎలాంటి ప్రలోభాలు, కుట్ర రాజకీయాలను సహించదని వారు అన్నారు. అధ్యక్షురాలు కవిత వేసే ప్రతి అడుగులో తాము ఉంటామని పేర్కొన్నారు. ఇన్నేళ్లుగా జాగృతి సంస్థతో తమకు అనుబంధం ఉందని దానిని అలాగే కొనసాగిస్తామని స్పష్టం చేశారు. జాగృతితో తెలంగాణ సమజాన్ని ఎంతో జాగృతం చేశామని తెలిపారు. కవిత ఎలాంటి నిర్ణయం తీసుకున్నా తాము అంతా సైనికుల్లా పని చేస్తామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాగృతి యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌ముదిరాజ్

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం



కార్మికశాఖ టీజీఓ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జాసన్, శ్యామ్‌సుందర్‌తో టీజీఓఏ రాష్ట్ర నేతలు

చిక్కడపల్లి: తెలంగాణ కార్మిక శాఖ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా బి.జాసన్, శ్యామ్‌సుందర్ జాజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీఓఏ) అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎ.సత్యనారాయణల సమక్షంలో జరిగిన ఎన్నికల్లో వారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సహ అధ్యక్షుడిగా ఎస్.చంద్రశేఖర్‌గౌడ్, కోశాధికారిగా యాదయ్య, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా వినీల, సహకార్యదర్శులుగా రవీందర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శిగా సీహెచ్ వెంకట్‌రెడ్డి, క్రీడల కార్యదర్శిగా కె.రాజుతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా పి.శ్రీరామ్‌రెడ్డి, రామారావులు వ్యవహరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు జాసన్ మాట్లాడుతూ... తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం సెంట్రల్ ఫోరంకు అనుబంధంగా పనిచేస్తామన్నారు. కార్మికశాఖలోని సమస్యలను సంబంధింత శాఖ మంత్రి జి.వివేక్, కార్యదర్శి దానకిషోర్‌ల తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.



తిలక్‌నగర్‌లోని పెద్ద గణేషుడి పూజలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



బాగ్‌అంబర్‌పేట సాయిబాబాకాలనీలో జరిగిన పూజలో మహిళలు



బాగ్‌అంబర్‌పేటలో జరిగిన గణపతి పూజల్లో కాంగ్రెస్ నేతలు



అంబర్‌పేట డివిజన్‌లో జరిగిన పూజలో బీజేపీ నేతలు

ఏకదంతా.!



బర్కత్‌పురలో యువత ఏర్పాటు చేసిన మండపంలో కాంగ్రెస్ నేత రాజేష్‌లాల్

మహా గణపతిం మనసా స్మరామి.!

ఉండ్రాళ్లయ్యా.. దండాలయ్యా.. అంటూ ఏకదంతుడిని భక్తులు భక్తిశ్రద్ధలతో పూజిస్తున్నారు. అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. వివిధ రూపాల్లో గణనాథుడు అందరినీ ఆకట్టుకుంటున్నాడు. ఎక్కడ చేసినా వక్రతుండుడే దర్శనమిస్తున్నాడు. దీంతో కాలనీలు, బస్తీలు ఆలయాల పరిసరాలను తలపిస్తున్నాయి. మొత్తం ఆధ్యాత్మిక శోభ నెలకొంది. గణేశ్ మండపాలను భక్తులు విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవ కమిటీలు ప్రత్యేక పర్యవేక్షణలో వేడుకలు నిర్వహిస్తున్నారు. ఆరు రోజులుగా పూజలందుకున్న వినాయకుడు ఏడో రోజు బుధవారం పలు ప్రాంతాల్లో గణనాథులను నిమజ్జనానికి తరలించారు. – కాచిగూడ

నీవే జగమంతా.!



బర్కత్‌పుర హౌసింగ్‌బోర్డు కాలనీ పార్కు గణేశ్‌ను దర్శించుకున్న డీజీపీ జితేందర్‌కుమార్



శివాజీనగర్‌లో.. దిడ్డి రాంబాబు, ఈఎస్‌వీసీ శేఖర్



గోల్నాకలో అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



బాగ్‌అంబర్‌పేటలో.. బీజేపీ నేత గౌతంరావు, నాయకులు



ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ మండపంలో భక్తులు



తిలక్‌నగర్‌లో గణేశ్ లడ్డూలతో భక్తులు



జైగంగాభవానీ యూత్ అసోసియేషన్ మండపంలో..



శ్రీసాయి రాజేంద్ర ప్రైడ్ అపార్ట్‌మెంట్‌లో చొప్పన్ భోగ్



శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో..



లేబర్ ఆఫీస్ వద్ద అన్నదానం చేస్తున్న వినయ్